క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



నకరికల్లు: సేవా కార్యక్రమాల్లో గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ముందంజలో నిలుస్తుందని అసోసియేషన్ సభ్యులు అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన దాచేపల్లి హుస్సేన్, పి.సైదాబి, సైదా పక్షవాతం సమస్యతో బాధపడుతుండడంతో వారికి తమ సంఘం తరఫున ఆర్థిక సాయం అందజేశామన్నారు. గ్రామంలో పుట్టి పెరిగి వివిధ రంగాల్లో ఉద్యోగాలు పొందిన వారంతా సంఘం ద్వారా సొంత గ్రామంలో సేవా క్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి బీజేపీ నేతల శుభాకాంక్షలు



క్రోసూరు: భారత దేశ ప్రధానిగా మూడవసారి నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేస్తున్నందున క్రోసూరు బీజేపీ నాయకులు ఆదివారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ భాగస్వామ్యంతో ప్రధాన మంత్రిగా దేశం మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా స్థానిక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధుకామేశ్వరచారి, బెల్లంకొండ మండల బీజేపీ అధ్యక్షుడు నూతక్కి సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు బుచ్చమ్మ, రమణమూర్తి, యు.నరసింహారావు, బి.వెంకటేశ్వర్లు, రమణమర్రి శివరాజు తదితరులు పాల్గొన్నారు.

చినుకు జాడ లేదు



క్రోసూరు: రుతుపవనాలు వచ్చేశాయి. తొలకరి పలకరించింది. కానీ, మండలంలో చినుకు జాడ ఇప్పటికీ కనిపించడం లేదు. చిరుజల్లులు మినహా ఓ మోతాదు వర్షం ఇప్పటి వరకు లేదు. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. మండలంలో సాగు విస్తీర్ణం 15 వేల ఎకరాలు ఉంది. ఇప్పటి వరకు పచ్చిరొట్ట పైర్లు కూడా సాగు చేయలేదని రైతులు చెబుతున్నారు. విత్తన విక్రయాలు జరుగుతున్నాయి. రైతులు ప్రకృతి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.

కవ్విస్తే.. కఠిన చర్యలు



నకరికల్లు: ఘర్షణలకు, తగాదాలకు పాల్పడకుండా గ్రామస్తులంతా కలసిమెలసి ఉండాలని ఎస్ఐ కె.నాగేందర్‌రావు అన్నారు. మండలంలోని గుండ్లపల్లి, నర్సింగపాడు గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకు శాంతి భద్రతలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాలు, సచివాలయాల భద్రతపై గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. కవ్వింపు చర్యలకు ఎవరూ పాల్పడవద్దన్నారు. శాంతి కమిటీల సభ్యులు ఇరు వర్గాలతో సమన్వయం చేసుకొని ఘర్షణలు జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుకు గురై యువకుడి మృతి

బొల్లాపల్లి: పాముకాటుకు గురై మేకలకాపరి మృతిచెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని హనుమాపురం గ్రామానికి చెందిన మేరాజోతు వంశీనాయక్ (18) పాముకాటుకు గురై మృతిచెందాడు. గ్రామానికి చెందిన అంజానాయక్, సావిత్రి బాయిల కుమారుడు వంశీ మేకల కాపరిగా పనిచేస్తూ మేకలను మేతకు తోలుకొని వెళ్లాడు. మేకలు మేస్తుండగా పరిసరాల్లో కలయి తిరుగుతున్న వంశీనాయక్ పాముకాటుకు గురయ్యాడు. దీంతో అనారోగ్యానికి గురవడంతో సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. వంశీ నాయక్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

నకిలీలు.. తస్మాత్ జాగ్రత్త

- విత్తనాలు, ఎరువుల ఎంపికలో అప్రమత్తం
- గుర్తింపు పొందిన సంస్థలవే కొనుగోలు చేయాలి
- ప్రతి కొనుగోలుకు బిల్లు తప్పనిసరి



విత్తన దుకాణాలలో నిల్వ ఉన్న విత్తనాలు



విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న పిడుగురాళ్ల ఏవో శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

పిడుగురాళ్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. రైతులు పంటల సాగుకు సమయత్తమవుతున్నారు. ఇప్పటికే పంట పొలాల్లో లోతు దుక్కులు చేస్తున్నారు. వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. పంటకు అదునైన వర్షం పడితే.. విత్తుకు సిద్ధంగా ఉన్నారు. రైతులు పంటలు వేసే ముందు ప్రధానంగా విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. మరీ ముఖ్యంగా రైతులు నకిలీ విత్తనాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ శాఖ అధికారులు కూడా నకిలీ విత్తనాలతో రైతులు అప్రమత్తంగా హెచ్చరికలు చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే డీలర్లకు నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

లైసెన్స్ పొందిన డీలర్లు, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. సీలు వేసిన, నాణ్యత ధ్రువీకరణ పత్రాలు ఉన్న విత్తనాల బస్తాలనే కొనుగోలు చేయాలని, విత్తనాల సంచులపై లాట్ నంబరు, గడువు తేదీ వంటివి పరిశీలించి రైతులు విత్తనాల సంచులను కొనుగోలు చేయాల్సి ఉందని చెబుతున్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని, ఆ బిల్లులపై డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండాలంటున్నారు. హైబ్రిడ్ విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో విత్తన రకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యు నాణ్యత వంటి వివరాలను పరిశీలించాలి. మొలకెత్తే దశ, పూత దశలో రోగం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

విత్తన శుద్ధి అవసరం..

రైతులు ప్రస్తుతం ఎక్కువగా హైబ్రీడ్ విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో అధిక శాతం విత్తన శుద్ధి చేసిన రకాలే అందుబాటులో ఉన్నాయి. విత్తన శుద్ధి చేయాల్సి వచ్చినప్పుడు కిలో విత్తనాలకు 2.50 గ్రాముల కార్బన్‌డైజిమ్ కలిపి 24 గంటల తర్వాత నారు మడిలో చల్లుకోవాలి. నీటిలో నానబెట్టినట్లు అయితే లీటర్ నీటికి ఒక గ్రాము కార్బన్ డైజిమ్ కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టి మడిలో చల్లుకోవాలి. విత్తనం నాన బెట్టడానికి ఒక కిలో విత్తనానికి ఒక లీటర్ నీరు సరిపోతుంది. కార్బన్ డైజిమ్ కాకుండా విత్తన శుద్ధికి సూడోమోనాస్ ఫ్లోరాసెన్స్ అనే జీవ శిలీంద్ర నాశినిని కూడా ఉపయోగించు వచ్చు. ఇది వ్యవసాయ శాఖ వద్ద మాత్రమే లభ్యమవుతుంది. దీనికి సంబంధించి కేజీ విత్తనాలకు 8 గ్రామాల మందును వినియోగించాలి. దీని వల్ల విత్తనం భూమి నుంచి శిలీంద్ర ద్వారా వచ్చే తెగుళ్లను సమర్థంగా అరికట్టవచ్చు. కొంత మంది రైతులు సొంత విత్తనాలను వినియోగిస్తున్నారు. సుమారు 15 ఏళ్లగా సొంత విత్తనం తయారీపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. దీంతో ఆసక్తి గల రైతులు సొంత విత్తనం తయారీకి అలవాటు పడ్డారు. ఈ తయారీ విధానం ద్వారా కూడా కల్తీ విత్తనాల భారీ పడకుండా ఉండేందుకు అవకాశం ఉంది.

బిల్లులు ఖచ్చితంగా ఇవ్వాలి

ఎరువులను విక్రయించే రైతులు ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా గుర్తింపు పొందాలి. నమోదు పత్రంలో పొందపరిచిన ఎరువులను విక్రయించాలి. డీలర్లు తమ వద్ద ఉన్న ఎరువుల వివరాలను స్టాక్ బోర్డుపై తప్పనిసరిగా ప్రదర్శించాలి. రైతులు కొనుగోలు చేసే ఎరువులకు డీలర్లు విధిగా బిల్లులు ఇవ్వాలి. బస్తాలపై చట్ట ప్రకారం నిర్దేశించిన ప్రభుత్వ ప్రామాణికాలు కచ్చితంగా ఉండాలి. కల్తీ, నాణ్యత లోపించిన ఎరువులు, తేమ వచ్చిన బస్తాలు ఉంటే వాటిపై సిరాతో గుర్తు చేసి, పక్కన పెట్టాలి. అటువంటివి రైతులకు డీలర్లు అమ్మకూడదు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



రైతులు విత్తన ఎంపిక విషయంలో జాగ్రత్తలు పాటించాలి. నాణ్యమైన విత్తనాలతోనే దిగుబడులు సాధించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను రైతులు భరోసా కేంద్రాల్లో, ప్రైవేటు డీలర్ల వద్ద, వ్యవసాయ సొసైటీలలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేయటం జరిగింది.

– నందిపాటి శ్రీనివాస్‌రెడ్డి,
ఏవో, పిడుగురాళ్ల

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో టైనీ టాట్స్ విద్యార్థికి 100వర్యాంక్

నరసరావుపేట ఈస్ట్: టైనీ టాట్స్ స్కూల్ విద్యార్థి టి.నాగభూషణ్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 100వ ర్యాంక్ సాధించాడు. జాతీయస్థాయిలో పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చిన నాగభూషణ్‌ను పాఠశాల డైరెక్టర్లు పి.శ్రీనివాసరావు, కోటేశ్వరమ్మ, కె.కొండలరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్లోబల్ ఐకాన్ అవార్డు గ్రహీతకు సన్మానం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషినల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయి వృద్ధాశ్రమంలో ఆదివారం గ్లోబల్ ఐకాన్ అవార్డు గ్రహీత రామకృష్ణ మాస్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వివేకానంద పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఆత్మకూరి రామకృష్ణ మాస్టర్ ఇటీవల హైదరాబాద్ రవీంద్ర భారతిలో మంజునాథ పొండేషన్ గ్లోబల్ ఐకాన్ అవార్డు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ఆశ్రమంలోని 37 మంది వృద్ధులకు వైస్ ప్రెసిడెంట్ మోటమర్రి భాస్కర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆర్యవైశ్య అఫిషిల్ అండ్ ప్రొఫెషినల్ అండ్ ప్రెసిడెంట్ గుండా బాల సైదారావు, స్టేట్ జాయింట్ సెక్రటరీ కొత్త చలపతిరావు, సభ్యులు కొత్త మల్లికార్జునరావు, రంగారావు, కొత్త రామకృష్ణ, కుటుంబ రావు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు శ్రీకారం



పచ్చిరొట్ట సాగుచేస్తున్న పొలం

ముప్పాళ్ళ: రైతులు రబీ సీజన్‌లో భాగంగా వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. కొందరు పచ్చిరొట్ట పైర్లు సాగు చేస్తుండగా, మరి కొంత మంది పత్తి సాగు పనులు మొదలు పెట్టారు. పంటలు సాగు చేసుకునేందుకు గాను భూములను లోతుగా దుక్కులు చేస్తున్నారు. ఈ ఏడాది రుతు పవనాల రాకతో అక్కడక్కడా చిరుజల్లులు పడుతుండటంతో పచ్చిరొట్ట పైర్లకు అనుకూలంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. మండలంలో అధికంగా మొక్కజొన్న సాగు పట్ల ఆసక్తి చూపుతుండటం, సాగు చేసే సమయం కూడా అధికంగా ఉండటంతో ముందస్తుగా పచ్చిరొట్ట పంట వేసుకున్నట్లయితే కొంత మేర పెట్టుబడి తగ్గించుకోవచ్చని సాగుకు శ్రీకారం చుట్టారు. మరికొన్ని గ్రామాల్లో ఓ మోస్తరు తొలకరి వర్షాలు పడిన తర్వాత పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకునేందుకు దుక్కులు సిద్ధంగా ఉంచారు. గతంలో ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించారు. గతంలో మాదిరిగానే రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని రైతులు కోరుతున్నారు.

పని ఒత్తిడి తగ్గించండి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ



మున్సిపల్ వర్కర్లతో మాట్లాడుతున్న చంద్రకళ

పిడుగురాళ్ల: మున్సిపల్ వర్కర్ల పని ఒత్తిడి తగ్గించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షరాలు చంద్రకళ డిమాండ్ చేశారు. పట్టణంలోని వర్కర్స్ కాలనీలో యూనియన్ నాయకుడు కె.సీతరామరామయ్య అధ్యక్షతన వర్కర్ల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రకళ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికులకు సబ్బులు, నూనె, యూనిఫాం వెంటనే ఇవ్వాలని కోరారు. వర్కర్స్‌కు పనిముట్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్‌లో ఉన్న హెల్త్ ఎలవెన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్, సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ కార్మికులు రామారావు, కాంట్రగుంట యలమంద, దేవళ్ల చిన వెంకటేశ్వర్లు, మహంకాళి వెంకయ్య, వీరమ్మ, కృష్ణవేణి, జయేంద్ర, గండ్ల పద్మ, దేవరగుంట లక్ష్మీ, కె.మేరమ్మ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన యువకుల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: కానిస్టేబుల్‌పై దాడిచేసిన సంఘటనలో ఇద్దరు యువకులను అర్బన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల ఏడో తేదీన పట్టణంలోని సీఆర్ కాలనీ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న నాదెండ్లకు చెందిన కానిస్టేబుల్‌పై దాడి చేసి పరారయ్యారు. దీంతో కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి సవాల్‌గా తీసుకున్నారు. ఇద్దరు యువకులు గుర్రాల క్రయవిక్రయాలు చేసే నెల్లూరు జిల్లాకు చెందిన మొలతోటి రామ్, లక్ష్మణ్ సోదరులుగా గుర్తించి, నిందుతుల్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈనెల 4న పట్టణంలో తమకు రావాల్సిన లావాదేవీలు జరుపుకొని వెళ్లే క్రమంలో వీరు కానిస్టేబుల్‌పై దాడి చేశారు. అయితే వీరు కొంతకాలంగా బాపట్ల జిల్లా ఇసుకదర్శిలో నివాసం ఉంటున్నారని వీరి వాహన నంబర్ ద్వారా తెలుసుకున్న పోలీసులు అదివారం అరెస్టు చేశారు.

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

నాదెండ్ల: గణపవరంలోని కోదండ రామాలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దర్శి ఉమామహేశ్వరశర్మ, అనిల్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వలేటి లక్ష్మీనారాయణ, సభ్యులు పర్యవేక్షించారు.

ప్రజలందరూ మనోధైర్యంతో ఉండాలి



తుమృకోట గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక దళాలు

రెంటచింతల: మండలంలోని ప్రజలందరూ పోలీసులకు సహకరించి మనోధైర్యంతో ఉండాలని ఎస్ఐ ఎం.ఆంజనేయులు అన్నారు. ఆదివారం తుమృకోట గ్రామంలో ప్రత్యేక దళాలతో కవాతు(ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలు సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల కర్తవ్యమన్నారు. గ్రామాలలో ఘర్షణలకు, దాడులకు తావులేదని గుర్తుంచుకోవాలన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని చెప్పారు. జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ప్రత్యేక ఆదేశాల మేరకు మండల పరిధిలోని తుమృకోట, రెంటాల, పాలువాయిగేటు, మంచికల్లు, జెట్టిపాలెం గ్రామాల్లో ప్రత్యేక దళాలు, ఏఆర్ పోలీసు సిబ్బందితో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైభవంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ



కోలాటం ఊరేగింపులో భక్తులు



శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మేయర్ కన్నా నాగరాజు

సత్తెనపల్లి: ఆర్య క్షత్రియ, ఆరె మరాఠా సంఘం ఆధ్వర్యంలో హైందవ సామ్రాజ్య వ్యవస్థాపకుడు శ్రీశ్రీశ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా విష్కరణ పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ఫిరోజీ ఋషీంద్రుల వారి మఠం నుంచి శ్రీ తారక్ చత్రపతి నాట్య కళా నిలయం శ్రీ తేనేటి కరుణాకర్ మాస్టార్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర వీధి వరకు కోలాటం, నృత్యం, మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. కాషాయం ధ్వజ పూజ, తుల్జా భవాని అమ్మవారి పూజ, తుల్జా భవాని అమ్మవారి హోమం చేపట్టారు. అనంతరం శ్రీశ్రీశ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణను మాజీ మేయర్ కన్నా నాగరాజు చేసి పూలమాలలు వేశారు. అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆర్య క్షత్రియ, ఆరె మరాఠా సంఘం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈ తగు జాగ్రత్తలు పాటిద్దాం

- బావులు, చెరువులు, కాలవల్లో ఈత ప్రమాదం
- స్విమ్మింగ్ పూల్‌లోనూ జాగ్రత్తలు పాటించాలంటున్న శిక్షకులు
- నిర్లక్ష్యం వహిస్తే వ్యాధులు తప్పవని హెచ్చరిక

ఈత సరదా పిల్లల ప్రాణాలు బలిగొంటోంది. వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు, యువకులు చెరువులు, బావుల్లోకి ఈతకు వెళ్తున్నారు. ఈత రాకపోయినా చాలా మంది పిల్లలు నీళ్లలోకి దిగి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



పట్టణంలోని డాక్టర్ పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని కిడ్స్ స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ పర్యవేక్షణలో స్విమ్మింగ్ (ఫైల్)

సత్తెనపల్లి: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి చక్కని మార్గం స్విమ్మింగ్ (ఈత). సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పట్టణంలో ఒక స్విమ్మింగ్ పూల్ మాత్రమే ఉంది. ఇటీవల దీనిని ప్రారంభించారు. యువత, చిన్నారులు అక్కడ సందడి చేస్తున్నారు. ఎండ తీవ్రత పెరగడం, ఆరోగ్య పరిరక్షణ నేపథ్యంలో ఇటీవల కాలంలో స్విమ్మింగ్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఎండల ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు పల్లెల్లో చెరువులు, కుంటలు, బావులను ఆశ్రయిస్తుండగా పట్టణంలో స్విమ్మింగ్ పూల్‌కు పరుగులు తీస్తున్నారు.

సందడే సందడి

ఎండలు తీవ్రత పెరగడంతో స్విమ్మింగ్ పూల్‌కు ఆదరణ పెరుగుతోంది. మహిళలకు సైతం వేర్వేరు సమయాల్లో శిక్షణ అందిస్తున్నారు. శరీరంలో అదనంగా పేరుకుపోయిన కొవ్వు కరగడంతో పాటు మధుమేహంతో బాధపడుతున్న వారికి ఈతతో ఉపశమనం కలుగుతుంది. ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పులు, అలర్జీ వంటివి దూరమై రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు అదుపులో ఉంటాయి. చురుకుదనం పెరిగి జ్ఞాపకశక్తి మెండుగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యంతో పాటు శరీరాకృతిని సైతం మెరుగు పరిచేందుకు స్విమ్మింగ్ దోహదపడుతుందని వైద్యం నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి....

స్విమ్మింగ్‌కు వచ్చేవారు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే చర్మ వ్యాధులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సరైన మోతాదులో కెమికల్స్ లేకపోతే ముప్పు తప్పదని అంటున్నారు. ఈతకు వచ్చేవారి నుంచి తమకు చర్మ వ్యాధులు, ఫిట్స్ లేని వారిని మాత్రమే స్విమ్మింగ్ పూల్ లోపలకి అనుమతించాలి.

ఈ జాగ్రత్తలు పాటించాలి...

- ఈత కొట్టే ముందు కొంతసేపు జాగింగ్ చేయడం మంచిది.
- శిక్షణకు వచ్చే వారిపై సిబ్బంది వ్యక్తిగతంగా ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి.
- స్విమ్మింగ్ డ్రెస్, క్యాప్, గ్లాసెస్, ట్యూబ్‌లను తప్పనిసరిగా వినియోగించాలి. లేక పోతే కళ్లకు, జుట్టుకు ఇన్ఫెక్షన్ వచ్చే ఆస్కారం ఉంది.
- చెవిలోకి నీరు వెళితే ఫంగస్ ఏర్పడుతుంది. ఇయర్ ప్లగ్స్ వాడటం మంచిది.
- కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ పొంది తర్వాత నీటిలో ఈదటం, కూర్చోవడం వంటివి మెల్ల మెల్లగా ప్రాక్టీస్ చేయాలి.
- కొలనులో నీరు తరచుగా మారుస్తుండాలి. స్వచ్ఛమైన నీటిలో మాత్రమే స్విమ్మింగ్ చేయాలి.
- నీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేకుండా చర్యలు తీసుకోవాలి.
- చర్మ, అంటు వ్యాధులు ఉన్నవారిని వీలైనంత వరకు స్విమ్మింగ్ చేసేందుకు అనుమతించకూడదు.
- కెమికల్స్ తరచూ మారుస్తూ ఉండాలి. నీటిలో బ్లీచింగ్ పౌడర్ వేస్తుండాలి. అలా అని బ్లీచింగ్‌ను ఎక్కువగా వాడకూడదు.
- స్విమ్మింగ్ పూల్‌తో పాటు చెరువుల్లోనూ ఈత పూర్తయిన తర్వాత ప్రతి ఒక్కరూ మంచి నీళ్ళతో స్నానం చేయడం మంచిది.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఈపూరు: మండలంలోని కూచినపల్లి, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరణ తెలుసుకొనుట వలన మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుందని త్రైత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశమని సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు, సభ్యులు కె.అరుణ, కె.కోటేశ్వరరావు, కె.నారాయణమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పోలీస్ పికెట్

యడ్లపాడు: మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం పోలీస్ పికెట్ కొనసాగింది. టీడీపీ పార్టీ కార్యకర్తలు ఈ నెల 4న యడ్లపాడు ఎస్సీకాలనీ(పైపల్లె)లో సంబరాలు చేసుకుంటూ స్థానికుల్ని దూషిస్తూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఘర్షణలో పలువురికి గాయాలై ఉద్రిక్తత నెలకొంది. పహారా కాస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.